క్లుప్తంగా

వేగంగా వాహనాలు నడపవద్దు



మాట్లాడుతున్న ఆర్టీఓ మురళీధర్

ప్రొద్దుటూరు క్రైం : వాహనాలను వేగంగా నడపడం ప్రమాదకరమని ఆర్టీఓ మురళీధర్ అన్నారు. జాతీయ రహదారి మాసోత్సవాల సందర్భంగా ఆర్టీఓ కార్యాలయంలో ఆటో, లారీ డ్రైవర్లకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ బైక్‌లో ప్రయాణించేవారంతా తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదం జరిగినా చిన్నపాటి గాయాలతో బయటపడొచ్చన్నారు. సెల్‌ఫోన్‌మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని పేర్కొన్నారు. ఆటో, లారీ డ్రైవర్లు యూనిఫాం ధరించాలని, తమ ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు నారాయణనాయక్, హేమకుమార్, రవీంద్రనాయక్, శ్రీనివాసరెడ్డి, కరీముల్లా, లక్ష్మీకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాజీ సీఎం జ్యోతిబసుకు నివాళి



బి.మఠం మాజీ సీఎం జ్యోతి బసు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

బ్రహ్మంగారిమఠం : పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం జ్యోతి బసు 15వ వర్ధంతిని శుక్రవారం బి. మఠంలో సీపీఎం నాయకులు నిర్వహించారు. సందర్భంగా జ్యోతి బసు చిత్ర పటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గండి సునీల్‌కుమార్, మండల కమిటీ సభ్యులు గండి గురవయ్య, బైరి ప్రసాద్, ఎర్రంపల్లె అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ అమలులో జాప్యం చేయడం తగదు

కడప ఎడ్యుకేషన్ : 2వ పీఆర్సీ అమలు విషయంలో కూటమి ప్రభుత్వం జాప్యం చేయడం తగదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐదేళ్లకోసారి పేరివిజన్ అమలు చేయడంలో పాలక వర్గాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రయోజనాలు నెరవేరుతాయని, ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతుందని భావించి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమించిన పీఆర్సీ కమిషన్ చైర్మన్.డాక్టర్. మన్మోహన్ సింగ్, కమిషన్ బాధ్యతల నుంచి తప్పుకున్నప్పటికీ, నూతన కమిషన్ ఏర్పాటు చేయడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపించారు. పీఆర్సీ సకాలంలో అమలు కాకపోతే పదవీ విరమణ పొందే ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రయోజనాలు అందక తీవ్రంగా నష్టపోతారన్నారు. కె.నరసింహారావు, ఎస్.ఎజాస్‌అహమ్మద్, ఎం.ప్రభాకర్, పి.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రేపు బ్రాహ్మణ సేవా సంఘ వార్షికోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో ఆదివారం ఉదయం సంఘం వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు కంబగిరిరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తాళ్లమాపురం తాత కొరటమద్ది తిప్పాభొట్ల సుబ్బావధానుల సంస్మరణ సభ, పండిత పురస్కారాలు అందిస్తామన్నారు. తిరుపతికి చెందిన బ్రహ్మశ్రీ పురిగెళ్ల రామకృష్ణశాస్త్రి ప్రసంగం, సన్మానం చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ సభ్యులు, బ్రాహ్మణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పేరుకు మాత్రమే బిల్లుల పండుగ

బిల్లులు మంజూరవుతాయని గత కొద్ది రోజులుగా కాంట్రాక్టర్లు ఎదురు చూస్తూ వచ్చారు. బిల్లులు వస్తే తమ బకాయిలు చెల్లించవచ్చని ఆశపడ్డారు. ఇందుకు అనుగుణంగానే ప్రకటనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.6,700 కోట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేశారని పేర్కొనడంతో కాంట్రాక్టర్లంతా సంబరపడ్డారు. ఇపుడు కార్యాలయాల చుట్టూ తిరిగినా స్పందన లేకపోవడంతో వెనుదిరుగుతున్నారు.

- బిల్లుల బకాయిలు రూ.20 కోట్లు
- కాంట్రాక్టర్లకు వచ్చింది రూ.35.5 లక్షలు
- ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం చుట్టూ కాంట్రాక్టర్ల ప్రదక్షిణ



ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం

ప్రొద్దుటూరు : వాస్తవానికి కొంత మంది కాంట్రాక్టర్లు అప్పులు తెచ్చి పనులు చేశారు. అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో మరింతమంది ఇతర ప్రాంతాలకు వెళ్లి దాక్కోవాల్సిన పరిస్థితి. పండగ అయిపోతే బ్యాంకుకు వెళ్లి అక్కడే మీ బాకీ చెల్లిస్తామని చెప్పిన కాంట్రాక్టర్లూ ఉన్నారు. కానీ ఇపుడు పరిస్థితి మారిపోయింది. ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి సంబంధించి ఇప్పటివరకు రూ.19,91,18,882 బకాయిలు రావాల్సి ఉంది. ప్రభుత్వం ప్రకటించినట్లు ఈ నెల 13వతేదీన పూర్తి బకాయిలు చెల్లించలేదు. కేవలం రూ.59,16,033 బిల్లులు మాత్రమే మంజూరయ్యాయి. వీటిలో మున్సిపల్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి రూ.23,65,850, అన్నీ పోనూ కాంట్రాక్టర్లకు కేవలం రూ.35,50,182 మంజూరైంది. దీంతో కాంట్రాక్టర్లు ఉసూరుమంటున్నారు. ప్రభుత్వం మళ్లీ ఎప్పుడు దయ తలుస్తుందోనని ఎదురుచూస్తున్నారు. వివిధ రకాల పనులకు సంబంధించి 126 బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి.

మున్సిపల్ పెండింగ్ బిల్లులు	రూ.19,91,18,882
మంజూరైన బిల్లులు	రూ.59,16,033
డిపార్ట్‌మెంట్ బిల్లులు	రూ.23,65,850
కాంట్రాక్టర్లకు వచ్చిన బిల్లులు	రూ.35,50,182

బిల్లులు చెల్లిస్తాం

అన్ని రకాల బిల్లులను సీఎఫ్‌ఎంఎస్ విధానం ద్వారా ప్రభుత్వానికి పంపడం జరుగుతుంది. ప్రభుత్వం నుంచి మంజూరైన బిల్లులను కాంట్రాక్టర్లకు చెల్లిస్తాం. సీఎఫ్‌ఎంఎస్ విధానంలో కాకుండా సాధారణ పద్ధతిలోనే బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

\- వి.మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్

ఫిబ్రవరి 2న బ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక



ఉచిత బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ ప్రముఖులు

ప్రొద్దుటూరు కల్చరల్ : తిరుపతి వినాయక నగర్‌లోని పాదుకా కంచి మఠంలో ఫిబ్రవరి 2న ఉచిత బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు అఖిత భారత కల్యాణోపాధ్యాయ వివాహ సమాచారం కేంద్ర అధ్యక్షుడు వి.శేషగిరిరావు తెలిపారు. స్థానిక వసంత పేటలోని బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో వివాహ పరిచయ వేదికకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 ఏళ్లుగా బ్రాహ్మణ వధూవరుల కోసం ఉచిత వివాహ వేదిక నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో 60 ఏళ్లు నిండిన వారికి షష్ఠిపూర్తి, 70 ఏళ్లు నిండిన వారికి భీమరథ శాంతి, 80 ఏళ్లు నిండిన వారికి సహస్ర చంద్ర దర్శనం కంచి స్వామి ఆదేశాల ప్రకారం నిర్వహిస్తున్నామన్నారు. వేంకట గాయత్రీ సేవా సంస్థ ద్వారా ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నామని, వధూవరులు ఈ నెల 20వ తేదీ లోపల 9848662668కు ఫోన్ చేసి తమ పేరు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు కంబగిరిరావు, బ్రాహ్మణ ప్రముఖులు వీవీ సుబ్బయ్య, కె.వెంకటేశ్వర్లు, సదాశివరావు, రవికుమార్, సత్యనారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లేశ్వరి

బద్వేలు అర్బన్ : స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఎంపీడీఓ డి.మల్లేశ్వరి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛదివస్ కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో వ్యర్థాలను తొలగించడం, మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడంతో పాటు నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని కోరారు.

జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సును జయప్రదం చేయండి



నరసాపురంలో కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

కాశినాయన : 19వ జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సును జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్వేష్, మండల కన్వీనర్ పోలయ్యలు తెలిపారు. శుక్రవారం నరసాపురంలో వారు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభజన హామీల్లో భాగంగా కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, నీటి ప్రాజెక్టులు, ఇతర పరిశ్రమలు, విద్య, వైద్య కళాశాలలు అమలు చేయాలన్నారు. ఈ జిల్లా సదస్సుకు సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.హెచ్.బాబురావు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జయానంద్‌లు హాజరవుతున్నారన్నారు. వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక ఆర్థిక మండలిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో వెనుకబడిన ప్రాంతాలకు యూపీఏ ప్రభుత్వం రూ.3 వేల కోట్ల నిధులను విడుదల చేసిందన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం విభజన హామీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత యువతకు ఉపాధి కల్పించిన దాఖలాలు లేవని విమర్శించారు. రాయలసీమలో ఖనిజ సంపద విస్తారంగా ఉందని, అన్నిరకాల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఆమోదయోగ్యంగా పాఠశాలల పునర్నిర్మాణం

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో 117 జీవో రద్దు తదనంతరం క్లస్టర్ పాఠశాలల ఏర్పాటు, మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఎంపిక ద్వారా పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఆర్‌జేడీ శామ్యూల్‌ను ఆయన కార్యాలయంలో శుక్రవారం ఎస్టీయూ నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ అందరికీ ఆమోదయోగ్యమైన విధానంలో ఈ ప్రక్రియ ముగిసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం మూడు, నాలుగు, ఐదు తరగతులను ప్రాథమిక పాఠశాలలకు తెస్తూ ప్రతి గ్రామపంచాయతీలో ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటుచేయాలనుకోవడాన్ని తాము ఆహ్వానిస్తున్నామన్నారు. ఒక్క పాఠశాల కూడా మూతపడకుండా పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియ పూర్తిచేయాలని కోరారు. అలాగే ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్, ఆంగ్లం సబ్జెక్టు ఉపాధ్యాయుల మిగులు ఏర్పడే పరిస్థితిని ఏ విధంగా అధిగమిస్తారో స్పష్టత ఇవ్వాలని కోరారు. రలో సంఘాలతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి అన్ని విషయాలపై చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎస్టీయూ నాయకులతో కలిసి సంఘ డైరీ, క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు.

మొర్రాయిపల్లెలో 'పొలం పిలుస్తోంది'

చాపాడు : మండల పరిధిలోని సోమాపురం, మొర్రాయిపల్లె గ్రామాల్లో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సీజన్‌లో పంటల దిగుబడులు, మార్కెట్ ధరల గురించి రైతులతో చర్చించినట్లు మండల వ్యవసాయాధికారి వ్యాగీ తెలిపారు. రబీ సీజన్‌లో వరి వేసే రైతులు నారు పోసుకోవడానికి ముందే విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల మళ్లింపు

పోరుమామిళ్ల : ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో శనివారం పోరుమామిళ్ల నుండి మైదుకూరు మీదుగా వెళ్లే వాహనాలు బద్వేలు, కడప మీదుగా వెళ్లాలని ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ట్రాఫిక్ సమస్య లేకుండా సహకరించాలన్నారు.

సీఎం పర్యటనతో మైదుకూరు అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు : సీఎం చంద్రబాబు మైదుకూరులో పర్యటించడం నియోజకవర్గ అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. శుక్రవారం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర ప్రజా వేదికపై రాజోలి ఆనకట్ట నిర్మాణం గురించి సీఎంకు విన్నవిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. అదే విధంగా మైదుకూరు మున్సిపాలిటీ అభివృద్ధిపై సీఎం వరాలను ఇచ్చే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గంలోని స్మశానాలకు ప్రహరీలు నిర్మించేందుకు నిధులను అడుగుతామని తెలిపారు.

బద్వేల్‌లో రైతు సేవా కేంద్రాల తనిఖీ



వ్యవసాయాధికారులకు సూచనలిస్తున్న ఏడీఏ నాగరాజ

అట్లూరు : బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని బద్వేలు మండలం బద్వేలు అర్బన్ రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రిజిస్టర్లను పరిశీలించారు. ఇ–పంట ప్రగతి, రైతుల ఈకేవైసీ, పీఎం కిసాన్ సంబంధిత అంశాలపై సమీక్షించారు. రబీలో సాగు చేస్తున్న పంటల వివరాలు, సాధారణ విస్తీర్ణం, తదుపరి సాగు అవకాశం ఉన్న విస్తీర్ణం వంటి వివరాలు సేకరించి రికార్డులు పక్కాగా నిర్వహించాలని రైతు సేవా కేంద్రం బాధ్య వ్యవసాయ సహాయకులు పి.బిందురాణికి సూచించారు. ఇ–పంట ప్రక్రియను సజావుగా, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం డివిజన్ కార్యాలయంలో బద్వేలు, గోపవరం, సిద్ధవటం, అట్లూరు మండలాల రైతుసేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు, మండల వ్యవసాయాధికారులతో రబీలో నిర్వహించే గ్యాప్ పొలంబడి, ఇన్డి గ్యాప్ సర్టిఫికేషన్ ప్రక్రియపై చర్చించి అవగాహన కల్పించారు. వారం వారం ఉత్తమ యాజమాన్య పద్ధతులపై పొలంబడి నిర్వహించి సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించి రైతులకు ఉత్తమ యాజమాన్య పద్ధతులపై ధృవీకరణపత్రాలు ఇవ్వాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంభించాలని తెలిపారు. ఏకశిల ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఒంటిమిట్ట కార్యనిర్వహణ అధికారిణి కట్టామౌనిక ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ సహకారంతో ఈ పొలంబడి నిర్వహించడం జరుగుతోందన్నారు. 20 మంది ఆదర్శ, ఆసక్తి కలిగిన రైతులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయడం జరిగిందన్నారు. ఏపీ రాష్ట్ర ఆర్గానిక్ ఉత్పత్తుల ధృవీకరణ సంస్థ గుంటూరు వారు ఈ ఇన్డిగ్యాప్ సర్టిఫికేషన్ స్కోప్ సర్టిఫికెట్ జారీ చేస్తారని, తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారులకు, రైతుసేవా కేంద్రం వ్యవసాయ సహాయకులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు, రైతుసేవా కేంద్రం సహాయకులు పాల్గొన్నారు.

న్యాయ సేవలపై అవగాహన పెంచుకోవాలి

కడప అర్బన్: న్యాయసేవలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ అన్నారు. కడప జిల్లా న్యాయ సేవా సదన్‌లో నిర్వహించిన ఓరియెంటేషన్ ప్రోగ్రాంలో జడ్జి మాట్లాడుతూ జాతీయ న్యాయసేవాధికార సంస్థ బాలల సంరక్షణ కోసం అమలు చేస్తున్న స్నేహ పూర్వక న్యాయసేవల పథకం 2024, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987, స్పెషల్ జోనల్ పోలీస్ యూనిట్ సపోర్ట్ పర్సన్స్ గార్డియన్, వార్డ్ యాక్ట్, బాలల, కౌమార లేబర్ చట్టం 1986, బాలల హక్కుల పరిరక్షణ చట్టం 2005, పిల్లల నిషేధ వివాహ చట్టం 2006, బాల్య న్యాయచట్టం 2015, ఉచిత, నిర్బంధ విద్య కోసం పిల్లల హక్కు చట్టం, 2009 లైంగిక నేరాల నుంచి పిల్లల సంరక్షణ చట్టం 2012, పిల్లల కోసం జాతీయ విధాన ం 2013 మిషన్ వాత్సల్య పథకం 2022 మోడల్ పోస్టర్ కేర్ మార్గదర్శకాలు 2024 పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి ఇన్‌ఛార్జి చైర్మెన్ గరికపాటి దీనబాబు, స్వర్ణ ప్రసాద్, బిఆర్. సుభాష్‌యాదవ్, పి.దౌలత్‌ఖాన్, న్యాయవాదులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

కుందూతీరంలో... రెండో పంటకు సిద్ధం



కుందూ సమీపంలో పచ్చగా ఉన్న నారుమడి



నిండుగా ప్రవహిస్తున్న కుందూ నది

కుందూతీరంలో రైతులు రెండో పంటగా వరి సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. నదిలో నీరు సంవృద్ధిగా పారుతోంది. గత ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట నూర్పిళ్లు పూర్తయ్యాయి. దిగుబడి, ధర అంతంత మాత్రంగా ఉండడంతో రెండో పంటగా మళ్లీ వరి సాగు చేస్తామని రైతులు చెబుతున్నారు. పంట కోత సమయంలో వర్షం పడడంతో చాలా నష్టపోవాల్సి వచ్చిందని వాపోతున్నారు. కోటి ఆశలతో రెండో పంట సాగు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

\- రాజుపాళెం